క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు



స్వామివారి ఉత్సవ విగ్రహాలను తిరువీధి నిర్వహిస్తున్న గ్రామస్తులు

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో గల అభయాంజనేయ స్వామివారి చక్రతీర్థ స్నానాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో తిరువీధి చేపట్టి అనంతరం గ్రామ సమీపంలోని కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు.

రూ.35 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు

కొత్తూరు: గ్రామాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు (మండల పరిషత్) రూ.35 లక్షలతో కూర్మదాసుపురం నుంచి కొత్తూరు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని గ్రామాల్లోనూ మౌలిక వసతులు కల్పించామన్నారు. జేఈ దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్‌లు లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, పడాల వెంకటకృష్ణ, మాజీ ఎంపీటీసీ దారపు రామకృష్ణ, పార్టీ నాయకుడు వడమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రైల్వే ట్రాక్ పనులు



గంగువాడ రైల్వే గేటు వద్ద ట్రాక్ పనులు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని గంగువాడ గ్రామ సమీపంలోని రైల్వే గేటు వద్ద ట్రాక్ పనులు రైల్వే ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో యాంత్రాలతో ఆదివారం యుద్ధ ప్రతిపాదికన చేపట్టారు. ఉదయం 10 గంటలకు పాతపట్నం–టెక్కలి రహదారిలో ఉన్న రైల్వే గేటును పూర్తిస్థాయిలో మూసివేశారు. ట్రాక్ పనులు పూర్తయిన వేంటనే గేటు తీశారు. పనులు చేపట్టడంతో ట్రాఫిక్‌ను టెక్కలి నుంచి తెంబూరు మీదుగా సారవకోటకు మళ్లించారు. ముందుగానే ట్రాఫిక్‌కు అంతరాయం ఉంటుందని రైల్వే అధికారులు తెలియజేయడంతో వాహనదారులు ఇటువైపు రాలేదు. ఇటీవల పర్లాకిమిడి–గుణుపూర్ రైల్వే ట్రాక్ (ఫాస్ట్ ట్రాక్) పనులు వేగవంతం చేసి, స్పీడ్ రైలు ట్రైల్ రన్ కూడా వేశారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం



లక్ష్మీనారాయణరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

సారవకోట: మండలంలోని మదనాపురం పంచాయతీ జరాళి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీ అయిన బద్రి లక్ష్మీనారాయణరావును గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. మారుమూల గిరిజన గ్రామమైన జరాళిలో ప్రతీరోజు పాఠశాల సమయం కంటే ముందు వచ్చి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేశారని ఆయన సేవలను స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నాన మోహన్‌రావు, సరియాపల్లి రాము, ఉపాధ్యాయుడు దువ్వారి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని గృహనిర్మాణశాఖ ఏఈ కె.రమేష్ తెలిపారు. తురకపేట, దబ్బపాడు, మిరియాపల్లి, బొత్తాడసింగి, పెద్దకొల్లివలస, సుమంతాపురం తదితర గ్రామాల్లో కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యాలయానికి వచ్చి నిర్మాణం పూర్తిచేసుకున్న ఫొటోలు సమర్పిస్తే బిల్లులు చెల్లిస్తామన్నారు.

నాడు భయం.. నేడు అభయం



కలివరం గ్రామం సమీపంలో కోతకు గురవుతున్న నాగావళి నదీతీరం గట్టు (నాడు)



కలివరం వద్ద నదిలో నిర్మించిన రాతిగట్టు నిర్మాణం (నేడు)

- రాతిగట్టు నిర్మాణంతో గ్రామాలకు రక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న నదీతీర గ్రామాల ప్రజలు



ఆమదాలవలస రూరల్: వరదలు వస్తే ఆ గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు ఉండేది కాదు. వరదల ప్రభావం వల్ల నదీతీరం (గట్టు) కోతకు గురికావడంతో గ్రామాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించేవి. వీటి నివారణకు అడ్డుకట్ట వేయాలంటే నదీ ప్రవాహాన్ని నిలుపుదల చేసేందుకు రాతి గట్టు నిర్మాణాలు చేపట్టాలి. దీనికోసం గతంలో పలుమార్లు నదీతీర గ్రామస్తులు గత ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవ తీసుకుని సమస్యను ప్రభుత్వానికి తెలపడంతో వెంటనే నిధులు విడుదల చేశారు. నది నీటి ప్రవాహం మరల్చడానికి కలివరం గ్రామం వద్ద సుమారు రూ.58 లక్షల వ్యయంతో ఆరు రాతిగట్టు (గ్రోయిన్స్) నిర్మాణాలు పూర్తిచేశారు. ఈ నిర్మాణాలు పూర్తికావడంతో వరదలు వచ్చే సమయంలో ఎటువంటి ముప్పు ఉండదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

నదీతీరంలో కలిసిన భూములు..

ప్రతీ ఏడాది వర్షాలు కారణంగా నదిలో వరదనీటి మట్టం పెరిగితే నదీతీరం కోతకు గురవుతుంది. వీటివల్ల పలు గ్రామాలు ముంపునకు గురికావడంతోపాటు విలువైన భూములు నదీతీరంలో కలిసిపోయాయి. వరదలు కారణంగా కలివరం గ్రామంలో నదిగట్టు వద్ద నిర్మాణంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు నదిలో కొట్టుకుపోయాయి. నదిలో నీటి మట్టం పెరుగుతున్న సమయంలో గట్టు కోతకు గురికావడంతో సమీపంలో ఉన్న కలివరం, ఇసుకలపేట, దిబ్బలపేట, కొత్తవలస, జీకేవలస, కొరపాం, నిమ్మతొర్లాడ గ్రామాలకు ఎక్కువగా వరద ముప్పు వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాతిగట్టు నిర్మాణం చేపట్టడంతో ఆస్తి, ప్రాణ నష్టం తప్పిందని ఆయా గ్రామస్తులు తెలిపారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



కంబకాయలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

నరసన్నపేట: మండలంలోని పలు పంచాయతీల్లో రూ.12.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, మరికొన్ని చోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం చేపట్టనున్నారు. ఈ మేరకు నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆదివారం తెలిపారు. ఉదయం కిళ్లాంలో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మంచి నీటి పథకాన్ని, సాయంత్రం తామరాపల్లిలో నిర్మాణం చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. కిళ్లాం, కొత్తపేట గ్రామాల్లో తాగునీటి పథకాలను ప్రారంభిస్తారు. మడపాంలో ఇంటింటికీ మంచినీటి కుళాయిల పనులను ప్రారంభిస్తారు. లుకలాంలో ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారు. కామేశ్వరిపేటలో హెల్త్ క్లినిక్, నడగాంలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనం, నడగాంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన, శివరాంపురంలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. చిక్కాలవలస, ఉర్లాంలో గ్రామ సచివాలయ భవనాలు, ఉర్లాంలో జల్ జీవన్ పనులు ప్రారంభించనున్నారు. గోకయ్యవలస రోడ్డును, యారబాడులో ఆర్‌బీకే భవనాన్ని, లింగాలపాడులో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. యారబాడు, కోమర్తి గ్రామాల్లో తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. కొటారపల్లి రోడ్డును, కంబకాయ, తామరాపల్లిల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను, జమ్ములో ఆర్‌బీకేని ప్రారంభిస్తారు. జమ్ము, రావాడపేట, శివరాంపురం గ్రామాల్లో నిర్మించిన ఇంటింటి తాగునీటి పథకాలను, జమ్ములో రోడ్డును ప్రారంభిస్తారు. కరగాం పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

రూ.7.4 కోట్లతో రహదారి నిర్మాణాలకు శంకుస్థాపన

పాతపట్నం: నియోజకవర్గంలో రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో నాలుగు రహదారులకు రూ.7.4 కోట్ల స్టేట్ డెవలప్‌మెంట్ స్కీమ్ నిధులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మెరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

రూ.2.4 కోట్లతో మెళియాపుట్టి–పాతపట్నం రహదారి, రూ.2 కోట్లతో తెంబూరు–పాతపట్నం రహదారి, రూ.2 కోట్లతో కిమిడి–రుగడ రహదారి, హిరమండలం మండలంలోని నౌతల–ముఖలింగం రహదారి, కోటి రూపాయలతో బీటీ రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు.

ఆంజనేయ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

హిరమండలం: స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమంలో అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గత కొన్నేళ్లుగా వందలాది మంది వృద్ధులకు ఆశ్రయం ఇచ్చిన సంగతి తెలిసిందే. దాతలు, దయార్థ హృదయుల సహకారంలో వృద్ధాశ్రమ సేవలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆశ్రమం ప్రాంగణంలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. త్వరితగతిన విగ్రహ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం హౌస్ విజిట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాఠశాల హెచ్‌ఎం టి.కేశవరావు తెలిపారు. హిరమండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం రాత్రి వెళ్లారు. చదువుతున్నారా, లేదా అని ఆరా తీశారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు నలుగురు గైర్హాజరు



ప్రాక్టికల్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు

హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆదివారం బోటనీకి సంబంధించి పరీక్షలు జరిగాయి. 20 మంది విద్యార్థులకు గాను శత శాతం హాజరయ్యారు. వొకేషనల్‌కు సంబంధించి 28 మంది విద్యార్థులకు 24 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న లింగరాజు

ఆమదాలవలస రూరల్: యువత మంచి మార్గంలో నడిస్తే అనుకున్న లక్ష్యాలు అధిరోహించవచ్చని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు అన్నారు. మండలంలో అక్కులపేటలో గల సత్యసాయి సేవా మందిరంలో యూత్ సాధనా శిబిరం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతతోనే దేశ భవిష్యత్ పయనిస్తుందని, ప్రతిఒక్కరూ సేవా మార్గం ఎంచుకుని క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. సమాజ సేవ చేసేందుకు ముందుకు వస్తే దేశం అభివృద్ధి చెందుతున్నారు. దేశం మనకు ఏం ఇచ్చిందనే ప్రశ్న కాకుండా దేశానికి మనవంతు ఏం సేవ చేస్తున్నామో ప్రశ్నించుకోవాలన్నారు. సత్యసాయి సేవా సంస్థ ద్వారా రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో యువకుల కోసం యూత్ సాధనా శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ జాయింట్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, ఎస్.జ్యోతి, యూత్ కోఆర్డినేటర్లు శివకుమార్, పి.చరిష్మాసాయి, జిల్లా పతాధికారులు ఎస్.రామచంద్రరావు, ఎం.రవీంద్రబాబు, చంద్రమౌళి, వినోద్‌స్వరూప్, శేఖర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన



కలశస్థాపన పూజలు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో నూతన యాగశాలకు ఆదివారం అనకాపల్లికి చెందిన యర్నగుల మోహనరావు దంపతులు కలశ స్థాపన పూజలు నిర్వహించారు. యాగశాల మందిరంపై కలశస్థాపనను అర్చకులు సంతోష్, నిర్మాణదాత చేతులమీదుగా ఏర్పాటు చేయించారు. మోహనరావు సుమారు రూ.5.5 లక్షలతో యాగశాల నిర్మాణం చేపడుతున్నారు. యాగశాల మండపం నిర్మాణం జరిగితే కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు, ధర్మకర్తలు కృష్ణారావు, నేతాజీ, సుదర్శనరావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరావు

ఆమదాలవలస: మార్చి 27న జరగనున్న ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఆమదాలవలసలో వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, కళాకారులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆమదాలవలస కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బగాది వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో సంఘం కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పేద కళాకారుల సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి, సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు, ఉపాధ్యక్షుడు దాశ్యం లక్ష్మణరావు, ఎస్.చంద్రశేఖరరావు, రామాచారి, పి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కవితల పోటీల్లో 'కుప్పిలి'కి అవార్డు



నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న కవి రాజారావు మాస్టార్

ఆమదాలవలస: విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో మల్లె తీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి కవితల పోటీలు నిర్వహించారు. ఆమదాలవలస పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నారు. వంద మంది కవులు పాల్గొన్న ఈ పోటీల్లో రాజారావు రచించిన 'మన్నించుమా జనయిత్రీ' కవిత టాప్ 10 లో నిలిచింది. తెలుగు అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా మెమొంటో, నగదు, ప్రశంసాపత్రాన్ని రాజారావు అందుకున్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆనందం, ధ్యానం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని ప్రజాపిత బ్రహ్మపుత్ర సమాజం శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి డి.ఉమామహేశ్వరి అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 17వ తేదీ క్లాపల్లిలోని సంప్రదాయ గురుకులం త్యాగరాజ స్వామి ధ్యాన ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, ఎస్.జోగి నాయుడు, ఆర్.వి.ప్రసాద్, జి.లక్ష్మి, వాసంతి, మల్లిబాబు, డాక్టర్ జి.ఎన్.రావు, కొండలరావు, ఈశ్వరరావు, మోహన్ పాల్గొన్నారు.

'యాత్ర-2' అద్భుతంగా ఉంది



సినిమాను చూస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: యాత్ర-2 సినిమా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతరంగాన్ని ఆవిష్కరించిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక వరలక్ష్మి థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి యాత్ర-2 సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాత్రను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారన్నారు.

ఎదురుగా బలమైన ప్రత్యర్థులు, కుట్రలు, కుతంత్రాలను చేధించి సీఎం జగన్ ప్రజాభిమానం అందుకున్న తీరు బాగుందన్నారు. ఒక్క వైఎస్సార్‌సీపీ అభిమానులే కాదు..ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూడాలన్నారు. చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీకుమారి, తదితరులు

ఎల్.ఎన్.పేట: భగవద్గీత ప్రతి ఒక్కరూ చదవాలని, ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సత్రం కమిటీ అధ్యక్షుడు జనార్దనరావు, లక్ష్మీకుమారి అన్నారు. త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఎల్.ఎన్.పేట మండలం మోదుగువలస, చిన్నకొల్లివలస గ్రామాల్లో పర్యటించారు. భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. త్రైతసిద్ధాంత గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంతం గ్రంథాలపై ప్రచారం చేశారు. భగవద్గీతను చదవటం, ఆచరించటం వల్ల మన నడవడికలో ఎంతో మార్పు చోటు చేసుకుంటుందన్నారు. ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మిక భావాలను కలిగి ఉండాలన్నారు. భాస్కరరావు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్



ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

నరసన్నపేట: నరసన్నపేటలో జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ఆదివారం సెలవు రోజున కూడా లబ్ధిదారుల సౌకర్యార్థం వీఆర్వోలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు బాధ్యతగా రిజిస్ట్రేషన్ పనులు చేపట్టారు. నరసన్నపేట పంచాయతీలో 1,044 ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 615 పూర్తిచేశారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. నరసన్నపేట మూడో సచివాలయంలో ఆదివారం సాయంత్రం లబ్ధిదారులకు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్వో అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై పూర్తిహక్కులు కల్పిస్తున్నామన్నారు.

వైభవంగా విగ్రహ శోభాయాత్ర

గార: శ్వేతగిరిపై వీరవసంతేశ్వర దేవాలయాలు ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రతిష్ఠ చేసేందుకు తయారు చేసిన పంచలోహ విగ్రహాలకు ఆదివారం సాయంత్రం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప, వల్లీదేవసమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు, గణపతి, రాజరాజేశ్వరి, నాగదేవత, నవగ్రహాలను వాహనంపై ఉంచి మంగళవాయిద్యాలు, కోలాటాల మధ్య గ్రామాల్లో యాత్రను నిర్వహించారు. మండల కేంద్రమైన గార, తాళ్లవలస, బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు, బూరవెల్లి గ్రామాల్లో యాత్ర సాగింది. జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, నాయకులు గొండు భాస్కరరావు, కొంక్యాన ఆదినారాయణ తదితర ప్రజాప్రతినిధులు యాత్రలో భాగస్వాములయ్యారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్ శర్మ, బంకుపల్లి నాగరాజుశర్మ, యోగీశ్వర శర్మ, కిశోర్‌శర్మ, మహేంద్రాడ సాయిశర్మలు పాల్గొన్నారు.